RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 240 | సంపుటి 4 | గురువారం | 21-05-2026 | పేజీలు 4 | వెల 3/-


2

## ఘనంగా "హెరిటేజ్ వాక్"

- కాకతీయుల వైభవాన్ని చాటిన కటాక్షాపూర్ త్రికూట దేవాలయాలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హెరిటేజ్ వాక్ నిర్వహణ
- చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రజాప్రతినిధులు
- పర్యాటక కేంద్రంగా కటాక్షాపూర్ అభివృద్ధికి చర్యలు
- ఆలయ అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- చారిత్రక సంపదను భావితరాలకు అందించాలన్న కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



- ఎండల తీవ్రతపై ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సూచన
- రాష్ట్రంలో 'హీట్ వేవ్'.. అధికారులకు కీలక ఆదేశాలు
- తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- ఉత్తర తెలంగాణలో ఉష్ణోగ్రతలు అధికం.. అప్రమత్తంగా ఉండాలని సీఎస్ కు ఆదేశం
- వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశం
- పట్టణాల్లో చలివేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖకు ఆదేశాలు
- జిల్లాల పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎస్ కు దిశానిర్దేశం

## మధ్యాహ్నం వేళ ప్రయాణాలు వద్దు

**ప్రభాత గమనం, హైదరాబాద్:**

రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పుల (హీట్ వేవ్) నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నందున, ప్రభుత్వ యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**వీలైనంత వరకు ప్రయాణాలు వద్దు..**


ఎండలకు తోడు వడగాల్పుల కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయవద్దని సీఎం కోరారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


**తాగునీరు, విద్యుత్‌కు ఇబ్బంది కలగవద్దు!**

వేసవి నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు, తాగునీటి ఎద్దడికి తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**వైద్యారోగ్య సిబ్బంది అలర్ట్..**

వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లను తగినంత మొత్తంలో అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వడదెబ్బతో ఆసుపత్రుల్లో చేరే బాధితులకు తక్షణమే సరైన వైద్య సహాయం అందించేలా వైద్యారోగ్య శాఖ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతుండాలని, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తూ వారికి తగిన దిశానిర్దేశం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని (CS) ముఖ్యమంత్రి ఆదేశించారు.




2

## 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు

- వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహణ
- విద్యార్థులు గంట ముందుగానే హాజరు కావాలని సూచన

## జంట హత్యల కేసులో నిందితుడికి ఉరిశిక్ష

3

- చెన్నారావుపేట జంట హత్య కేసులో సంచలన తీర్పు
- నిందితుడికి మరణ శిక్ష విధించిన కోర్టు

**వరంగల్ బ్యూరో, మే20(ప్రభాత గమనం):**

వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 16చింతల్ తాండలో చోటుచేసుకున్న దారుణ జంట హత్యల కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్యాభర్తలను అత్యంత క్రూరంగా హత్య చేసి, ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ వరంగల్ I అదనపు జిల్లా న్యాయమూర్తి జె. మైత్రేయి కఠిన తీర్పు ప్రకటించారు.



2

## భక్తులు ఇబ్బంది పడొద్దు

- సరస్వతి అంత్య పుష్కరాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- కాళేశ్వరంలో పటిష్ట బందోబస్తుకు పోలీసు శాఖ ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎస్పీ
- ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్ ల భద్రతపై ప్రత్యేక దృష్టి
- మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు
- తప్పిపోయిన వారి కోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- వెయ్యి మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు
- ఇతర శాఖలతో సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచన
- పోలీసులకు సహకరించాలని భక్తులకు ఎస్పీ విజ్ఞప్తి

## పోలీసుల విస్తృత తనిఖీలు

- జిల్లా వ్యాప్తంగా భారీ నాకాబందీ, ఆకస్మిక వాహన తనిఖీలు
- నెల్లికుదురులో కారులో 2.5 కిలోల గంజాయి పట్టివేత
- ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మహబూబాబాద్, తొర్రూరు సబ్ డివిజన్లలో 3,485 వాహనాల తనిఖీ
- నంబర్ ప్లేట్లు లేని 74 వాహనాలపై చట్టపరమైన చర్యలు
- డ్రగ్స్ అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తున్న పోలీసులు
- అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా
- నాకాబందీ పాయింట్లను స్వయంగా పరిశీలించిన ఎస్పీ డా. శబరీష్
- సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ

జిల్లాలో గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన భారీ నాకాబందీ, ఆకస్మిక వాహన తనిఖీల్లో నెల్లికుదురు ప్రాంతంలో 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి తరలింపుకు ఉపయోగించిన కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. — వివరాలు 2వ పేజీలో



# ఘనంగా "హెరిటేజ్ వాక్"

- కాకతీయుల వైభవాన్ని చాటిన కటాక్షాపూర్ త్రికూట దేవాలయాలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హెరిటేజ్ వాక్ నిర్వహణ
- చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రజాప్రతినిధులు
- పర్యాటక కేంద్రంగా కటాక్షాపూర్ అభివృద్ధికి చర్యలు
- ఆలయ అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- చారిత్రక సంపదను భావితరాలకు అందించాలన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




**ప్రభాత గమనం, హనుమకొండ :**

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని చారిత్రక కటాక్షాపూర్ త్రికూట దేవాలయాల వద్ద తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక – ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన "హెరిటేజ్ వాక్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పర్యాటక జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కటాక్షాపూర్ త్రికూటాలయం పరిసరాల్లో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆలయ చారిత్రక విశిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి చారిత్రక నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. అలాంటి వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఆలయాన్ని బాధ్యతతో సంరక్షిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఆలయ ప్రవేశద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రక వారసత్వాన్ని కేవలం సంరక్షించడం మాత్రమే కాకుండా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా యువతలో చరిత్రపై అవగాహన పెంపొందుతుందని అన్నారు. కటాక్షాపూర్ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కాకతీయుల నిర్మాణ శైలి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న చారిత్రక సంపదను ప్రజలకు పరిచయం చేయడం అవసరమని అన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం చారిత్రకంగా ఎంతో విలువైనదని, దీని పరిరక్షణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కటాక్షాపూర్ త్రికూటాలయంలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సమీప చెరువులో బోటింగ్ వంటి ఆకర్షణీయ కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని అందించాలనే లక్ష్యంతో "హెరిటేజ్ వాక్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు

**కేసముద్రం మే20(ప్రభాత గమనం):**

బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలను పార్టీ మండల నాయకులు బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి శంకర్ నాయక్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..రానున్న రోజులలో తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.రైతుల పక్షపాతి బిఆర్ఎస్ అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు గులోత్ వీరు నాయక్, జిల్లా నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి,ఊకంటి యాకూబ్ రెడ్డి,మండల నాయకులు గూగులోత్ సునీల్ కుమార్, కౌన్సిలర్లు జాటోత్ సునీత,ఆగే రాము, పైరాల శరత్ కుమార్, దూదేపాక కృష్ణ, మేకల శారద, రావుల వినయ్ రెడ్డి, సర్పంచులు ఏర్పుల సునీత కుమార్, కందునూరి ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ లు ముఖ్య కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ను కలిసిన శంకర్ నాయక్

**హైదరాబాద్, మే20(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని హైదరాబాద్ లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా కేటీఆర్ శంకర్ నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వారి సతీమణి డాక్టర్ సీతామహాలక్షి , కూతురు బానోత్ తేజస్వి,అల్లుడు తేజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు

- వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహణ
- విద్యార్థులు గంట ముందుగానే హాజరు కావాలని సూచన



**ప్రభాత గమనం, హనుమకొండ :**

తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు (జనరల్ మరియు ఒకేషనల్) ఈ నెల 22 నుండి 25 వరకు నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా పరీక్షల కన్వీనర్ ఏ. గోపాల్ తెలిపారు. వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో ఈ పరీక్షలు జరుగనున్నాయని పేర్కొన్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ విషయాన్ని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్‌తో పాటు అవసరమైన రికార్డు పుస్తకాలు, ఇతర పరీక్షా సామగ్రిని తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి కనీసం గంట ముందుగానే హాజరు కావాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో క్రమశిక్షణ పాటిస్తూ ఇన్విజిలేటర్లు, పరీక్షా సిబ్బంది సూచనలను అనుసరించాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సమయానికి పరీక్షా కేంద్రాలకు పంపించి సహకరించాలని జిల్లా పరీక్షల కన్వీనర్ ఏ. గోపాల్ కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి

- జిల్లాలో జూన్ 2 నాటికి మిగిలిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రభాత గమనం, హనుమకొండ :**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వాటి పురోగతి, బిల్లుల చెల్లింపులు, గ్రౌండింగ్ కాని ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దార్థ నాయక్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యం 3,045 కాగా ఇప్పటి వరకు 2,090 ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 955 ఇండ్లను జూన్ 2 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో పాటు లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈ రవీందర్, ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పూర్తి చేయడంలో పార్టీలు సహకరించాలి

- బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై దృష్టి పెట్టాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ ఎన్. రవి సమావేశం

**ప్రభాత గమనం, హనుమకొండ :**

జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి కోరారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రకటన వెలువడిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహించే కార్యక్రమాలకు బీఎల్ఏలు సహకరించాలని కోరారు. బీఎల్ఓలు, సూపర్వైజర్లు జవాబుదారీతనంతో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో తమ వంతు సహకారం అందిస్తామని రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో వారు పలు సూచనలు, అభిప్రాయాలను అధికారులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, దాస్యం విజయభాస్కర్, కుసుమ శ్యాంసుందర్, నర్మెట శ్రీనివాస్, నాగబెల్లి రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, ప్రవీణ్ కుమార్, మచ్చ లక్ష్మణ్, అంబాల ప్రశాంత్, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.




## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- ఆలయంలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల నుంచి చోరీ సొమ్ము రికవరీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఆలయ చోరీ కేసును 24 గంటల్లో ఛేదించి ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.2.40 లక్షల విలువైన 1080 గ్రాముల వెండి ఆలయ సామగ్రితో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమవరం ప్రాంతానికి చెందిన కల్లకూరి కిరణ్ బాబు, అనంతపూర్ జిల్లాకు చెందిన సందీప్ కుమార్ ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడెప్పాడు గ్రామంలోని ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయానికి చెందిన వెండి సామగ్రిని అపహరించినట్లు తెలిపారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన ఆత్మకూర్ పోలీసులు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను గుర్తించారు. అనంతరం ఆత్మకూర్ మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ విచారణలో ప్రధాన నిందితుడు కిరణ్ బాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి 50కి పైగా చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా కేసును వేగంగా ఛేదించి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్ మరియు పోలీసు సిబ్బందిని ఏసీపీ సతీష్ బాబు అభినందించారు.






# పుష్కరాల నిర్వహణపై సమీక్ష

- బందోబస్తుపై పోలీసులకు ఎస్పీ ఆధ్వర్యంలో బ్రీఫింగ్
- భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశాలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లాలో మే 21 నుండి జూన్ 1 వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లపై విస్తృతంగా బ్రీఫింగ్ ఇచ్చారు. అనంతరం పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్‌ల వద్ద భద్రత, పార్కింగ్ ప్రాంతాలు, హెలిప్యాడ్ భద్రత, క్యూ లైన్ల నిర్వహణ, పరిశీలించడం జరిగింది.తప్పిపోయిన వారి సహాయక కేంద్రాలు, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్, సీసీఎస్ టీమ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1000 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పోలీస్ శాఖకు సహకరించి సూచనలు పాటిస్తూ పుష్కరాలను సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు.

# జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

- నెల్లికుదురులో 2.5 కిలోల గంజాయి స్వాధీనం
- ముగ్గురు నిందితులు అరెస్ట్

**మహబూబాబాద్, ప్రభాత గమనం:**

ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్–డివిజన్ల పరిధిలో భారీ నాకాబందీ, ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడం, రౌడీ షీటర్లు మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడం ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు మరియు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మహబూబాబాద్ మరియు తొర్రూరు సబ్–డివిజన్ల పరిధిలో కలిపి మొత్తం 3485 వాహనాలను తనిఖీ చేశారు. మహబూబాబాద్ సబ్–డివిజన్ పరిధిలో డిఎస్పీ, 4 సీఐలు, 18 ఎస్.ఐలు, 100 మంది పోలీస్ సిబ్బందితో 1985 వాహనాలను తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 74 వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

అలాగే తొర్రూరు సబ్–డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక నాకాబందీలో 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో 12 మంది ఎస్సైలు, 4 మంది సీఐలు,డీఎస్పీ పాల్గొని 1500 వాహనాలను తనిఖీ చేశారు. ఈ నాకాబందీ సందర్భంగా నెల్లికుదురు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీలలో ఒక కారులో సుమారు 2.5 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, గంజాయి తరలింపుకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, స్వయంగా మహబూబాబాద్ పట్టణంలోని మూడు కోట్ల సెంటర్ మరియు ధరణి హాస్పిటల్ సమీపంలోని నాకాబందీ పాయింట్లను పరిశీలించి విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



# ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ నిర్వహించాలి



- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

స్టేషన్ అధికారులు పారదర్శకంగా ఫిర్యాదుల విచారణ నిర్వహించి భాదితులకు బాసటగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ తెలిపారు. వరంగల్ సీపీ బుధవారం ఈస్ట్ జోన్ పరిధిలోని చెన్నరావుపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించారు చేశారు. ఈ ఉదయం చెన్నరావుపేట పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు.చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జంట హత్యల కేసులో నిందితుడికి ఉరిశిక్ష

- చెన్నారావుపేట జంట హత్య కేసులో సంచలన తీర్పు
- నిందితుడికి మరణ శిక్ష విధించిన కోర్టు

**వరంగల్ బ్యూరో, మే20(ప్రభాత గమనం):**


వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 16చింతల్ తాండలో చోటుచేసుకున్న దారుణ జంట హత్యల కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్యాభర్తలను అత్యంత క్రూరంగా హత్య చేసి, ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ వరంగల్ I అదనపు జిల్లా న్యాయమూర్తి జె. మైత్రేయి కఠిన తీర్పు ప్రకటించారు.బిఎన్ఎస్ సెక్షన్లు 333, 103(1), 109, 351(3) మరియు ఎఆర్ఎంఎస్ యాక్ట్ సెక్షన్ 25(1ఏ) కింద నమోదైన ఈ కేసులో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీ దోషిగా తేలాడు. బిఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద నేరం రుజువుకాగా, బిఎన్ఎస్ సెక్షన్ 238(2) ప్రకారం "మెడకు ఉరి వేసి మరణించే వరకు" ఉరిశిక్ష అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. అదనంగా రూ.5 వేల జరిమానా కూడా విధించింది. ఈ ఘటనలో బానోత్ సుగుణ (45), ఆమె భర్త బానోత్ శ్రీను (50) ప్రాణాలు కోల్పోగా, బానోత్ దీపిక (21), బానోత్ మదన్ లాల్ (17) తీవ్ర గాయాలతో బయటపడ్డారు. బాధితులంతా గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు.ఈ దారుణ ఘటనపై బానోత్ ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసులో మొదట చంద్ర మోహన్, సిఐ , ఎస్పీ వరంగల్ దర్యాప్తు చేపట్టగా, అనంతరం శ్రీనివాస్,సిఐ నెక్కొండ సర్కిల్ విచారణ కొనసాగించారు. ప్రస్తుతం చెన్నారావుపేట ఎస్ఐగా రాజేష్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందా దేవి సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడినట్లు న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

# యాదాద్రి జిల్లాలో బాల్య వివాహం

- మైనర్ ను పెళ్లి చేసుకున్న కానిస్టేబుల్
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు

**హైదరాబాద్ మే20(ప్రభాత గమనం):**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నా యిని అనిల్ కుమార్ గౌడ్ ఈ నెల 9వ తేదీన అనంతగిరి మండలానికి చెందిన మైనర్ బాలికను రహస్యంగా అర్ధరాత్రి వివాహం చేసుకున్నా డు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే అధిక కట్నం ఆశతో మైనర్ బాలికలను వివాహం చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్లో శిశు సంక్షేమ శాఖ అధికారు లు ఫిర్యాదు చేయగా అనిల్ గౌడ్ పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.





# తెలంగాణలో రాబోయేది బీసీ రాజ్యమే

- టీఆర్పీ అధినేత తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్, మే20 (ప్రభాత గమనం) :**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో ఈరోజు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు, యువకులు టిఆర్పి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్ మోహన్, రాష్ట్ర కార్యదర్శి యం. శివవీర్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు మున్నూరు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా టిఆర్పి అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి, నియామక పత్రాలు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా ఆకుల చంద్రశేఖర్, టౌన్ మైనార్టీ అధ్యక్షులుగా నజీర్, దేవరకద్ర ఇంచార్జ్‌గా మంగరాయి వెంకటేష్, దేవరకద్ర మండల ఇంచార్జ్‌గా మన్యం, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మరియు అన్ని వర్గాల ప్రజలు ఒకే జెండా కింద ఏకమవుతున్నారని తెలిపారు. తమ నాయకత్వంలో తెలంగాణలో నిజమైన బీసీ రాజ్యం స్థాపన ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల ఆత్మగౌరవం కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాతి బిడ్డల సంపూర్ణ మద్దతు ఉందని అన్నారు. బీసీ రాజ్య నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ మల్లన్న గారి నాయకత్వానికి అండగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. "సమాజంలో మార్పు,బీసీ రాజ్యాధికారం" అనే నినాదంతో కొనసాగుతున్న ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా యువజన అధ్యక్షుడు జి. రవికుమార్ సహా పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

**మహబూబాబాద్, మే20(ప్రభాత గమనం):**

బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సిరోలు మండలం మన్నెగూడెం, మరిపెడ లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (ఫ్యాక్స్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలు ప్రస్తుతం నిల్వ ఉన్న వివరాలు మిల్లులకు గోదాములకు పంపిన ధాన్యం వివరాల ఇన్వార్డ్ అవుట్ వార్డు రిజిస్టర్ ను, ట్యాబెట్ ఎంట్రీ, మాస్టర్ రైతులు , వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల లో ప్రత్యేక అధికారులు, తహసీల్దారులను నియమించడం జరిగిందని వారి పర్యవేక్షణలో ప్రతి ఒక్కరు ఒక కేంద్రానికి నిబద్ధత కలిగిన అధికారిని నియమించి ప్రతినిత్యం కొనుగోలు రవాణా విషయాలలో వేగంగా పనిచేస్తూ లక్ష్యాలను చేరుకునే దిశగా ఉన్నారని అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉండాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, లోడింగ్ అన్లోడింగ్ లో వేగం పెంచాలని, సాధ్యమైనంత త్వరగా స్థానిక వాహనాలను హమాలీలను సమకూర్చుకొని ధాన్యాన్ని తరలించాలన్నారు. జిల్లాలో సరిపడంతా ప్రదేశాలు మిల్లులు, గోదాములలో ఉందని లారీ కాంట్రాక్టర్స్ ఆ దిశగా తరలించాలని సూచించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట డిఆర్డిఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, డిస్టిక్ మేనేజర్ నరసింహారావు, సిరోలు, మరిపెడ మండలాల తహసిల్దార్లు కృష్ణవేణి, పున్నం చందర్ ఉన్నారు.

# అల్లుడికి వెండి చెప్పులు బహూకరణ

**హైదరాబాద్, మే20(ప్రభాత గమనం):**



వెండి ధర ఆకాశాన్నంటుతున్న వేళ.. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తన అల్లుడి కోసం కిలోన్నర వెండితో ప్రత్యేకంగా రూపొందించిన కొల్హాపురి చెప్పులను కానుకగా అందజేశాడు. ఈ పాదరక్షల కోసం దాదాపు రూ.4 లక్షలకుపైగా ఖర్చుపెట్టారు. కొల్హాపూర్ కు చెందిన ప్రముఖ చర్మకారుడు విక్రాంత్ మాలి దాదాపు ఎనిమిది రోజులు శ్రమించి ఈ ప్రత్యేక చెప్పులను రూపొందించాడు.

# వడదెబ్బతో వృద్ధుడు మృతి

- కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామంలో ఘటన

**కేసముద్రం మే20(ప్రభాత గమనం):**



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతి చెందారు. కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ళ సోమయ్య(65) బుధవారం ఉపాధి హామీ పనులకు వెళ్లి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# నిషేధిత పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హసన్‌పర్తి ఎస్సై సుజిత్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు అనంతసాగర్ శివారులోని ఆర్ఆర్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా హోటల్‌లో భారీ మొత్తంలో గుట్కా, ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించాయి. హోటల్ యజమాని తవటం శ్యాంబాబును విచారించగా, హనుమకొండకు చెందిన ఉమేష్ రాజ్‌పుత్ అనే వ్యక్తి తనకు ఈ పొగాకు ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు వెంటనే హనుమకొండలోని ఉమేష్ రాజ్‌పుత్‌కు చెందిన హనుమాన్ కిరాణా జనరల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కూడా భారీ మొత్తంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా, పొగాకు ఉత్పత్తుల మొత్తం విలువ సుమారు రూ.42 వేల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



# నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను
# వేగంగా పూర్తి చేయాలి

- పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్
- రోజుకు 20 లక్షల మంది కార్మికులతో పనుల నిర్వహణ
- ప్రతి గ్రామంలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలి
- మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వచ్చే 40 రోజుల్లో వినియోగించాలి
- లైవ్ అథెంటికేషన్ సర్వేతో కొత్త అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరుకు అవకాశం
- ఎన్ పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి
- నరేగా పనులు, చేయూత పింఛన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన స్పెషల్ సీఎస్



**మహబూబాబాద్ మే20(ప్రభాత గమనం):**

నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం, హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. నరేగా కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రణాళికలో ఉన్న అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల కోసం ముందురోజే కార్మికుల సమీకరణ చేపట్టాలని, పనులు గ్రామ హాబిటేషన్ పరిధిలోనే ఉండేలా చూడాలని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించి పనులను వేగవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూముల్లో కూడా ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను చేపట్టి రైతులకు ఉపయోగకరంగా మలచాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం వేళల్లో జిల్లా కలెక్టర్లు స్వయంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 8 వేల వీవో భవనాలకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన పనులను బుక్ చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో సీసీ డ్రైయిన్‌ల శుభ్రత పనులను నిరంతరంగా చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ. 408.79 కోట్లకు పరిపాలనా అనుమతులు లభించగా, ఇప్పటివరకు రూ.65.20 కోట్ల మేర మాత్రమే క్లెయిమ్ చేయబడిందని, ఇంకా రూ.343.59 కోట్ల బ్యాలెన్స్ నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే 40 రోజుల్లో ఈ నిధులను ప్రాధాన్యతగా బుక్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు సగటున రూ.30 కోట్లకు పైగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించాలన్నారు. గత ఏడాది నీటి సంరక్షణ పనుల్లో పలువురు కలెక్టర్లు కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ ఏడాది మరింత ఎక్కువ పనులు జరుగుతున్నప్పటికీ పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడంతో రాష్ట్రం ప్రస్తుతం 10వ స్థానంలో ఉందన్నారు. మనం చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పనితీరు తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, నరేగా పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించాలని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ వెంటనే కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, అందులో పోస్టల్ శాఖ ద్వారా 21 లక్షల మందికి నగదు రూపంలో పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మరో 20 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ జమ అవుతోందన్నారు. ఫేస్ రికగ్నిషన్ విధానం అమలుతో మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన లబ్ధిదారుల కారణంగా ఇప్పటికే సుమారు 20 వేల పెన్షన్లు తగ్గినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరికీ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన పైలట్ సర్వేలో సుమారు 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. లైవ్ అథెంటికేషన్ సర్వే పూర్తయ్యే సమయానికి కనీసం 5 శాతం మరణించిన లబ్ధిదారుల కేసులు గుర్తించినా మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. నగదు రూపంలో పెన్షన్ పంపిణీని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. పెద్దపల్లి, జగిత్యాల, కొత్తగూడెం, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఇంకా సుమారు 2 వేల పోస్టల్ పంపిణీలు మాత్రమే ఉన్నాయని, వాటిని కూడా బ్యాంకింగ్ విధానానికి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సదరం కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సదరం కేంద్రాలు ఏర్పాటు చేసి దివ్యాంగుల అంచనా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో సదరం కేంద్రాల్లో అవసరమైన సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 80 నుంచి 100 శాతం తీవ్ర దివ్యాంగత కలిగిన సుమారు 23 వేల మంది ఉన్నారని, కొత్త పింఛన్ల మంజూరులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావాలి

నిర్మల్ జిల్లాలో ఎన్‌పీఏలను పూర్తిగా సున్నాకి తగ్గించడం అభినందనీయమని పేర్కొన్నారు. జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు కూడా త్వరలోనే ఎన్‌పీఏలను జీరో స్థాయికి తీసుకురానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులు, ఎన్‌పీఏల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలుకు సంబంధించి కొత్త జీవో విడుదలైందని, ఈ పథకం అమలు బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం అమలుకు ఎంపీడీవోలే అధికారులని పేర్కొన్నారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు ఈ పథకం కింద రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. ఇతర బీమా పథకాల ప్రయోజనం లేని ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి

### కలెక్టర్ స్నేహ శబరిష్

విసి అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ చేస్తూ....ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి పని కల్పించాలని.. ఎంపీడీఓ లకు లక్ష్యాలను నిర్దేశించారు. గ్రామీణ అభివృద్ధి ధ్యేయంగా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లా కి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మునిసిపల్ కమిషనర్ లు ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి
# ఆర్థిక సాయం అందజేత

**కేసముద్రం, మే20 (ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ (55) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది కలిసి రూ. 25 వేల ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ ఆవుల ఐలయ్య, గ్రామ కార్యదర్శి వెంకన్న, గ్రామ వార్డ్ సభ్యులు జనిగల అనిల్ కుమార్, జీజుల వరలక్ష్మి , రాజబోయిన శ్రీను, జ్యోతి, కుండే బాల కుమార్, కంచ రాజకుమార్, పలుస పద్మ, తండ సంపత్, సుదగాని మమత, బండారు యాకమ్మ, మంద ప్రవీణ్, కారోబార్ కంచ కట్టయ్య, గోపీనాథ్, సిబ్బంది విజయ్, అనిల్, వెంకన్న, యాకయ్య, సుగుణ, లావణ్య పాల్గొన్నారు.

## స్నేహితుల చేయూత

ఇటీవల ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ అకాల మరణం చెందగా వారి కుటుంబానికి కేసముద్రం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 1987–88 బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచారు.గద్దల ప్రభాకర్ కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితులు, ముగ్గురు ఆడపిల్లలు కావడంతో ప్రభాకర్ చిన్ననాటి స్నేహితులు కలిసి 18,500 రూపాయలు ప్రభాకర్ భార్య అయిన సునీతకు అందజేశారు. అలాగే వారి స్నేహితులు ఎల్లవేళల ప్రభాకర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో తోడుగా ఉన్న ప్రభాకర్ స్నేహితులకు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులు రాపాక వెంకట్ నారాయణ, కోమటిరెడ్డి పిచ్చిరెడ్డి మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- ఎండల తీవ్రత నేపథ్యంలో బయటికి రావొద్దు
- రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి

**హైదరాబాద్, మే20(ప్రభాత గమనం):**

రాష్ట్రంలో తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరం లేకుండా ప్రయాణాలు చేయొద్దని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.శరీరంలో నీరసం రాకుండా తరచూ నీరు తాగాలని, ఓఆర్ఎస్, కొబ్బరి నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు...

# పెట్రో ధరలు తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

- ఇందన ధరల పెంపుపై మండిపడ్డ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత అశోకన్నా
- ధరల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం

**మహబూబాబాద్, మే20(ప్రభాత గమనం):**



పెట్రోల్, డీజిల్ ధరలను వరుసగా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఇంధన ధరల తగ్గింపుకోసం ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ ధరలను పెంచడం దారుణమని విమర్శించారు. మూడు రోజుల క్రితమే పెట్రోల్, డీజిల్ ధరలను మూడు రూపాయలు పెంచిన కేంద్ర ప్రభుత్వం, మంగళవారం మరోసారి లీటరుకు 90 పైసలు పెంచడం ప్రజలపై మరింత భారాన్ని మోపే చర్య అని అశోకన్నా పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని రంగాలపై ప్రభావం పడుతుందని అన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు జీవన వ్యయాల పెరుగుదలతో ఆర్థికంగా కుంగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వాణిజ్య, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలను కూడా భారీగా పెంచి బీజేపీ ప్రభుత్వం ప్రజలపై కనికరం లేకుండా భారం మోపుతోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని అశోకన్నా ఆరోపించారు. ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం పాలకులు పని చేస్తున్నారని, గత 12 ఏళ్లుగా పేద ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చిన ఆయన, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ప్రభుత్వం ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# పెట్రోల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

- సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్

**కేసముద్రం, మే20(ప్రభాత గమనం):**



కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ధరలు పెంచి మూడు రోజులు కాకముందే మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ అన్నారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఒక ప్రకటన విడుదల చేస్తూ పెట్రోల్ డీజిల్ ధరలను ఒక వైపు తగ్గించాలని ప్రజలు ఆందోళన చేస్తుండగా మళ్లీ ధరలు పెంచడం దారుణం అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రోల్ ధరల పెంపుతో రవాణా నిత్యవసర సరుకులు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రాల్లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తుందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయిందని అన్నారు. పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు అనేక రాయితీలిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడం సరైంది కాదన్నారు. ఇది ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమా లేక ప్రజలను నిలువు దోపిడీ చేసే ప్రభుత్వమా అని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374